వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్మించిన ఇంద్రభవనంలాంటి ఎస్పీ కార్యాలయ సముదాయం

అభివృద్ధికి అడ్డా.. వనపర్తి గడ్డ

- సాగునీటి కల్పనలో నంబర్‌వన్
- 14 మండలాలకు ప్రాజెక్టులతో నీళ్లు
- విద్యాలయాలకు నిలయంగా ఖ్యాతి
- అభివృద్ధిలో మంత్రి సింగిరెడ్డి మార్కు

చుట్టు కొండలు, గుట్టల మధ్యన ఉండే వనపర్తిని ఉమ్మడి పాలకులు పట్టించుకోలేదు. సాగు, తాగునీరు ఇవ్వలేదు. దీంతో ప్రజలు ముంబైకి వలస వెళ్లేవారు. బీఆర్ఎస్ పాలనలో వనపర్తి అభివృద్ధికి అడ్డాగా మారింది. జిల్లాగా మారడంతో మహర్దశ పట్టింది. సాగునీటి రాకతో పాడిపంటల నెలవైంది.

వనపర్తి, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంగా మారడంతో వనపర్తి దశ తిరిగింది. ఎడ్యుకేషన్ హబ్‌గా మారింది. మినీలిఫ్టులు, కాల్వలతో సాగునీటి రాకతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారింది. 62 కోట్లతో 25 ఎకరాల్లో సమీకృత కలెక్టరేట్ నిర్మించారు. 34 ప్రధాన ప్రభుత్వ విభాగాల శాఖలు ఒకేచోట కొలువుదీరాయి. 38.50 కోట్లతో 29 ఎకరాల్లో ఎస్పీ కార్యాలయాన్ని నిర్మించారు. వనపర్తి శివారులో రూ.550 కోట్లతో 50 ఎకరాల్లో మెడికల్ కాలేజీ నిర్మించారు. జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలను రూ.40 కోట్లతో 45 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. పెబ్బేరులో 65 ఎకరాల్లో రూ.65 కోట్లతో తొలి మత్స్యకళాశాలను ఏర్పాటు చేయించారు. వ్యవసాయ డిగ్రీ మహిళా కళాశాల, మహాత్మా జ్యోతిబాపూలే మహిళా కళాశాలను తీసుకొచ్చారు. మినీలిఫ్టులతోపాటు లింక్ కెనాల్‌లు, భీమా ఫేజ్-2తో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సాగునీటికి ఢోకాలేకుండా చేశారు. బుద్ధసముద్రం, గణపసముద్రం చెరువులను రిజర్వాయర్లుగా మార్చారు. తాజాగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా ఏదుల రిజర్వాయర్‌ను నిర్మించారు. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా వయాడక్ట్ నిర్మించి తండాల గుట్టలపైకి నీళ్లను ఎక్కించి సాగుకు యోగ్యం చేశారు. సాగులో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ వానాకాలం సీజన్‌లో 1.86 లక్షల ఎకరాల్లో వరి సాగైంది.

సాగునీటి వసతులు పుష్కలం

పెబ్బేరు మండలంలో కొంతభాగం మినహా మిగతా ప్రాంతమంతా సాగునీటి వసతులు లేవు. గత ఐదేండ్లలో మిగిలిన మండలాలకు ఎంజీకేఎల్ఐ ద్వారా సాగునీరందేలా నిరంజన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని 3 మండలాలకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి నీటి వసతులు సమకూర్చారు. కొత్తకోట, మదనాపురానికి బీమా, ఎంజీకేఎల్ఐ నీటిని అందించడంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సఫలీకృతమయ్యారు. మక్తల్ పరిధిలోని 2 మండలాలకు జూరాల నుంచి సాగు నీరందించడంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషిచేశారు. సాగునీటి వసతుల్లో వనపర్తి జిల్లా నంబర్‌వన్‌గా నిలిచింది.

మును'గోడు' తీరింది

- 4,545 కోట్లతో అభివృద్ధి పనులు
- 'డిండి'తో ఫ్లోరైడ్‌కు పరిష్కారం
- మిషన్ భగీరథకు ఇక్కడే శ్రీకారం
- మల్కాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్
- ఒక్క ఏడాదిలో 600 కోట్ల పనులు

తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మును'గోడు' తీరింది. దశ మారింది. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్న మిషన్ భగీరథ పథకం ఇక్కడి నుంచే మొదలైంది. డిండి ఎత్తిపోతలతో ఫ్లోరైడ్‌కు పరిష్కారం లభించింది. తాగు, సాగు నీటి గోస తీరింది. రూ.4,545 కోట్లతో నియోజకవర్గవ్యాప్తంగా అభివృద్ధి జరిగింది.



నాంపల్లి మండలం ఎస్‌డబ్ల్యూ లింగోటం గ్రామంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మునుగోడు దశ మారింది. మిషన్ భగీరథతో దశాబ్దాల ఫ్లోరైడ్ పీడ విరగడైంది. మునుపెన్న డూ లేని విధంగా రూ.4,545 కోట్లతో నియోజకవర్గవ్యాప్తంగా అభివృద్ధి జరిగింది. సమైక్య పాలకుల నిర్లక్ష్యంతో 2014 నాటికి ప్రపంచంలోనే మునుగోడు అత్యధిక ఫ్లోరైడ్ ప్రాంతంగా చరిత్రకెక్కింది. ఉద్యమ సమయంలోనే కేసీఆర్ పలుమార్లు మునుగోడులో పర్యటిస్తూ ఫ్లోరైడ్ బాధితులను చూసి చలించిపోయారు. ఫ్లోరైడ్ రక్కసిని రూపుమాపేందుకు ఇంటింటి కీ కృష్ణాజలాలు ఇచ్చేందుకు మిషన్ భగీరథ ప థకానికి సీఎం కేసీఆర్ ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టారు. భగీరథ ప్లైలాన్‌ను చౌటుప్పల్‌లో 2015 జూన్ 8న కేసీఆర్ ఆవిష్కరించారు. నియోజకవర్గంలో మెజార్టీ ప్రాంతాలకు తాగునీటి సరఫరా కోసం నాంపల్లి మండలం ఎస్‌డబ్ల్యూ లింగోటం వద్ద రోజుకు 70 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంటును నిర్మించారు.

మౌలిక వసతుల కల్పన

మునుగోడు నియోజకవర్గంలో రూ.151 కోట్లతో జీపీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించారు. 52 కోట్లతో 16 సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు, ఇతర విద్యుత్తు పనులు చేపట్టారు. 52.79 కోట్లతో సర్వేల్ గురుకుల సహా ఇతర హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించారు. 1.49 కోట్లతో గోదాములు, మరమ్మతులు చేపట్టారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలకు 45 కోట్లు కేటాయించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఏడాదిలోపే 600 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. గతంలో ఉన్న పెండింగ్ పనులు సైతం పూర్తి చేశారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో 460 ఎకరాల్లో ఏర్పాటు చేసిన గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నది. ఇప్పటికే 20 పరిశ్రమలు ఉత్పత్తులు ప్రారంభించాయి. మరో 150 పరిశ్రమలు నిర్మాణంలో ఉన్నాయి. ఈ పార్కు వినియోగంలోకి వస్తే 400 పరిశ్రమలు పనిచేస్తాయి. దీంతో 40 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. 231 ఎకరాల్లో యాదాద్రి ఫుడ్ పార్కు, మరో 100 ఎకరాల్లో బొమ్మల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. చండూరు రెవెన్యూ డివిజన్, గట్టుప్పల్ మండలం దశాబ్దాల కలను సీఎం కేసీఆర్ నెరవేర్చారు.

అభివృద్ధి పనులు ఇలా..

- **6,500** కోట్లతో డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు
- **1,480** కోట్లతో శివన్నగూడెం రిజర్వాయర్
- **495** కోట్లతో లక్ష్మణాపురం రిజర్వాయర్
- **102.9** కోట్లతో పిల్లాయిపల్లి కాల్వ మరమ్మతు
- **113** కోట్లతో చెరువుల మరమ్మతులు
- **3.68** కోట్లతో ప్రత్యేక చేనేత క్లస్టర్ల ఏర్పాటు
- **216.897** కోట్లతో ఆర్‌అండ్ బీ రోడ్ల నిర్మాణం

అచ్చంపేటలో వంద పడకల దవాఖాన

అచ్చంపేట.. అభివృద్ధి బాట

- ఎంజీకేఎల్ఐ లిఫ్టుతో సాగు జలాలు
- 2,500 కోట్లతో అచ్చంపేట లిఫ్టు
- రెండు చోట్ల ఎకో టూరిజం కాటేజీలు
- అచ్చంపేటలో 100 పడకల దవాఖాన

అచ్చంపేట అంటే నల్లమల అటవీ ప్రాంతం.. వినిరేని నట్టుగా ఉండే గ్రామాలు.. తాగేందుకు గుక్కెడు నీళ్లు దొరకవు.. బోర్లు వేసినా నీళ్లు పడవు.. ఏదైనా ఆపదొస్తే వైద్యానికి దేవుడే దిక్కు.. అలాంటి అచ్చంపేట నియోజకవర్గంలో కేసీఆర్ పాలనలో పెనుమార్పులు వచ్చాయి. అనేక ప్రాంతాలకు సాగునీళ్లు వచ్చాయి. పోడు పట్టాలు, డబుల్ ఇండ్లు అందాయి. 100 పడకల దవాఖాన వచ్చింది. పరిపాలన చేరువైంది.

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): స్వరాష్ట్రంలో అచ్చంపేట అభివృద్ధికి మెట్టులా తయారవుతున్నది. సీఎం కేసీఆర్ ప్రత్యేక ప్రేమ, అచ్చంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు కృషితో ప్రగతి పరుగులు పెడుతున్నది. గుక్కెడు నీళ్లు దొరకని, బోర్లు వేసినా పడని దుస్థితిని మిషన్ భగీరథ పూర్తిగా మార్చివేసింది. ఇంటింటికీ నల్లాలతో నీటిని అందిస్తూ తాగునీటి సమస్య శాశ్వతంగా తీర్చింది. మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుతో ఉప్పునుంతల, అచ్చంపేట, బల్మూర్‌లోని కొన్ని ప్రాంతాలకు సాగునీళ్లు వస్తున్నాయి. ప్రభుత్వం 2,500 కోట్లు మంజూరు చేయడంతో అచ్చంపేట లిఫ్టు పనులకు శంకుస్థాపన చేశారు. లిఫ్టు పూర్తయితే నియోజకవర్గంలోని మద్దిమడుగు, పదర, అమ్రాబాద్ వంటి ప్రాంతాల ఆయకట్టు (72 వేల ఎకరాలు)కు సాగునీరు అందుతుంది. 150 మందికి డబుల్ ఇండ్లు మంజూరవడంతో పేదల్లో సంతోషం నెలకొన్నది. 100 పడకల దవాఖాన ప్రారంభమైంది. పోడుభూములకు పట్టాల పంపిణీతో చెంచులు, గిరిజనులు అటవీ భూములకు ఓనర్లు అయ్యారు. ఈగలపెంట, మన్ననూరులో ఎకో టూరిజంలో భాగంగా నిర్మించిన కాటేజీలు పర్యాటకానికి కొత్త అందాన్ని తెచ్చాయి. గతంలో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఒకట్రెండు రోజులు పట్టేది. ఇప్పుడు నాగర్‌కర్నూల్‌కు వెళ్లి ఒక్క రోజులోనే పని చేసుకొంటున్నారు. నల్లమలలోని మద్దిమడుగు, సలేశ్వరం, ఉమామహేశ్వరం, రం గాపూర్‌లాంటి ప్రాంతాలు ఆధ్యాత్మికంగా ప్రత్యేకతను తీసుకొచ్చాయి.

అచ్చంపేటలో అభివృద్ధి పనులు..

అచ్చంపేటలో 4.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు శంకుస్థాపన చేశారు. ఉమామహేశ్వరం, మల్లెలతీర్థం ఆలయాలను అభివృద్ధి చేశారు. అచ్చంటపేలో ఇండోర్, ఎన్టీఆర్ స్టేడియాల్లో రూ.3.50 కోట్లతో వసతులు కల్పించారు.డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.100 కోట్లు మంజూరు చేశారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. గిరిజన పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. ఆర్డీవో, పోలీస్ సబ్ డివిజన్ కొత్త కార్యాలయాల ఏర్పాటుచేశారు. అచ్చంపేట, ఉప్పునుంతలలో 15 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.107 కోట్లతో 15 కిలోమీటర్ల బ్రాంచ్‌కెనాల్ నిర్మాణానికి రూ.107 కోట్లు విడుదల చేశారు.

నవంబర్ 25కల్లా ఓటరు స్లిప్‌ల పంపిణీ

- ప్రవాసులకు పాస్‌పోర్ట్‌తో ఓటు
- ఫొటోతోఉన్న ఓటరు కార్డు లేనివారికి మరో చాన్స్
- 12 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి చూపాలి
- ఎన్నికల సంఘం స్పష్టీకరణ

హైదరాబాద్, అక్టోబరు 25 (నమస్తే తెలంగాణ): ఓటరు జాబితాలో ఉన్న ఓటర్లందరికీ నవంబర్ 25కల్లా ఓటరు సమాచార స్లిప్‌లను పంపిణీ చేయనున్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది. ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఫొటోతో ఉన్న ఓటరు కార్డు లేదా మరో 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకదానిని పోలింగ్‌స్టేషన్‌కు తీసుకురావాలని సూచించింది. ఓటరు తన పోలింగ్ స్టేషన్‌ను, ఓటర్ల జాబితాలోని తన క్రమ సంఖ్యను, పోలింగ్ తేదీ, సమయం వివరాలను తెలుసుకోవడానికి వీలుగా ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్ జారీ చేస్తామని వివరించింది. భారత పాస్‌పోర్ట్‌లోని వివరాల ఆధారంగా ఓటర్ల జాబితాలో నమోదైన ప్రవాస ఓటర్లను ఓటింగ్‌కు అనుమతించాలని పేర్కొన్నది. పోలింగ్ స్టేషన్‌లో వారి పాస్‌పోర్ట్ ఆధారంగానే ఓటు హక్కు గుర్తించాల్సి ఉంటుందని, దీనికి ఇతర ఏ గుర్తింపు పత్రం పరిశీలించాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం స్పష్టంచేసింది.

ఆ 12 కార్డులు ఇవే..

ఇందులో ఆధార్‌కార్డ్ , మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్, బ్యాంక్/పోస్ట్ ఆఫీస్ (ఫొటోతో ఉన్నవి) పాస్‌బుక్‌లు, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, జాతీయ జనాభా రిజిస్టరు జారీ చేసిన స్మార్ట్‌కార్డ్, భారత పాస్‌పోర్ట్, ఫొటోతో ఉన్న పింఛను పత్రం, ఉద్యోగులకు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వం/ప్రభుత్వ సంస్థలు/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఫొటోగుర్తింపు కార్డులు, చట్టసభల సభ్యత్వాన్ని చూపే అధికారిక గుర్తింపు కార్డులు, దివ్యాంగుల గుర్తింపు కార్డులు చూపించవచ్చని వివరించింది. ఏదైనా గుర్తింపు కార్డులో దొర్లిన చిన్న చిన్న అక్షర దోషాలను అధికారులు పట్టించుకోవద్దని ఎన్నికల సూచించింది.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- కాంగ్రెస్, బీజేపీలను జనం నమ్మరు
- మీడియాతో మంత్రి వేముల

నవీపేట, అక్టోబర్ 25: తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోతో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమైందని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు వారిని నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. బుధవారం మంత్రి వేముల నిజామాబాద్ జిల్లా నవీపేట మండల కేంద్రంలోని బంధువుల ఇంటికి వచ్చారు. తల్లి మరణానంతరం మొదటిసారి బయటకు వచ్చిన ఆయన అక్కడే మీడియాతో మాట్లాడారు. తాజా రాజకీయ పరిణామాలు, బీఆర్ఎస్ మ్యా నిఫెస్టోపై ఆయన స్పం దించారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో అస్తవ్యస్తమైన కరెంట్ సరఫరాతో తెలంగాణ ప్రజలు గోస పడ్డారని, దానిని దృష్టి లో పెట్టుకుని కేసీఆర్ సుమారు లక్ష కోట్లతో విద్యుత్తు వ్యవస్థను గాడిలో పెట్టారని చెప్పారు. ఫలితంగానే వ్యవసాయానికి, గృహ అవసరాల కు, పరిశ్రమలకు నిరంతరం విద్యుత్తు సరఫరా సాధ్యమైందని వివరించారు. కేసీఆర్ మూడోసారి అధికారంలోకి రాగానే రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామని చెప్పారు. తెలంగాణ బాగుకోసం సీఎం తాపత్రయపడుతుంటే.. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మాత్రం అధికారం కోసం కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా విమర్శిస్తున్న రేవంత్, కిషన్‌రెడ్డి ఆయన కాలిగోటికి సరిపోరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ చెప్పింది చేస్తాడనే నమ్మకం ప్రజలకు ఉన్నదని అన్నారు.

కేసీఆర్ వెంటే కార్మికవర్గం

- ఇంటింటికీ ధీమా-కేసీఆర్ బీమా పథకంపై అసంఘటితరంగ కార్మికులకు ప్రచారం
- బీఆర్ఎస్‌కేవీ నేతలు రాంబాబు, రూప్‌సింగ్

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కార్మికవర్గం అంతా సీఎం కేసీఆర్ వెంటే ఉన్నదని బీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్, నేతలు రూప్‌సింగ్, వేముల మారయ్య చెప్పారు. కార్మికవర్గ పక్షపాతి కనుకే సీఎం కేసీఆర్ 'ఇంటింటికీ ధీమా-కేసీఆర్ బీమా' పథకాన్ని బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించారని తెలిపారు. బుధవారం తెలంగాణభవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా బీడీ, భవన నిర్మాణ, హమాలీ తదితర అసంఘటిత రంగ కార్మికులు కోటి మంది ఉంటారని, ఆ కుటుంబాల్లో కొత్తకాంతులు నింపేందుకు సీఎం కేసీఆర్ తేనున్న బీమా పథకంపై కార్మికవర్గంలో విస్తృత ప్రచారాన్ని చేపడతామని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వలే కార్మికవర్గ ప్రయోజన కార్యక్రమాలు చేపట్టలేదని పేర్కొన్నారు. 'ఇంటింటికీ ధీమా-కేసీఆర్ బీమా' దేశంలోని అసంఘటిత కార్మికలోక కల్యాణానికి మేలిమలుపు కాబోతున్నదని చెప్పారు. సమావేశంలో శివశంకర్, దాన కిశోర్, శ్రీనివాస్, నిర్మలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కేంద్ర బలగాల కవాతు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వేములవాడ పట్టణంలో స్థానిక పోలీసులతో కలిసి కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ కవాతులో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, బీఎస్ఎఫ్ కమాండెంట్, అడిషనల్ కమాండెంట్, వేములవాడ డిఎస్పీ నాగేంద్రచరి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

- అభివృద్ధే ధ్యేయంగా పనిచేశా
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడి

పాలకుర్తి రూరల్, అక్టోబర్ 25 : సీఎం కేసీఆర్ సహాయ సహకారాలతో పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేశానని పంచాయతీరాజ్ శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలే పార్టీని విజయపథంలో నడిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల స్థాయి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూ హంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ.. పాలకుర్తిలో ప్రతిపక్షాలకు డిపాజిట్ ద క్కకుండా చేయాలని సూచించారు. సర్వేల ప్రకారం తాను సుమారు 60 వేల మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. పాలకుర్తి మండలంతోపాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ప్రతి గ్రామంలో గల్లీగల్లీకి సీసీరోడ్లు వేశామని, డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించినట్టు చెప్పారు.

ఖమ్మం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ

అభివృద్ధికే పట్టం

- తుమ్మల వ్యాఖ్యలు బాధాకరం
- రవాణా మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మం, అక్టోబర్ 25: ఖమ్మం నియోజకవర్గంలో అభివృద్ధి.. అహంకారానికి మధ్య పోటీ జరుగుతున్నదని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. కేవలం రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసమే కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తాను అధికారులు, చిరుద్యోగులతో సైతం మర్యాదగా నడుచుకుంటానని తెలిపారు. ఇప్పటివరకు ఎవరి పట్ల దురుసుగా ప్రవర్తించలేదని స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మం నగరంలో న్యాయవాది మల్లాది వాసుదేవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పోలీసులను జీపుల ముందు పరిగెత్తిస్తాం' అని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అహంకార పూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతే బీఆర్ఎస్ అధిష్ఠానం తుమ్మలను పిలిచి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేసిందని తెలిపారు. నాడు దర్జాగా పదవులు అనుభవించి, నేడు నిస్సిగ్గుగా బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. గోదావరి జలాలు తీసుకొచ్చి ప్రజల కాళ్లు కడుగుతానని చెప్పిన తుమ్మల.. ఆ పనిలో నిమగ్నం కాకుండా, ఇప్పుడు ప్రజల కాళ్ల చెంతకు వెళ్లి ఓట్లు అభ్యర్థించే పని ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు.

పాలకొండలో కూరగాయలు అమ్ముతూ ప్రచారం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఉద్యోగ కల్పనే సర్కారు ధ్యేయం

- ప్రజా ఆశీస్సులతో లక్ష మెజార్టీ పక్కా
- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- పాలకొండ నుంచి ప్రచారం షురూ

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 25: ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని పాలకొండలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం, షాషాబ్‌గుట్ట దర్గా, కల్వరీ ఎంబీ చర్చిలో కుటుంబసమేతంగా పూజలు, ప్రార్థనలు చేశారు. అనంతరం పాలకొండ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో లక్ష ఓట్ల మెజార్టీ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా ఊహించని విధంగా అభివృద్ధి జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సతీమణి శారద, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హాంకాంగ్‌లో ఘనంగా సద్దుల బతుకమ్మ

హైదరాబాద్, అక్టోబరు 25 (నమస్తే తెలంగాణ) : సద్దుల బతుకమ్మ వేడుకలను ది హాంకాంగ్ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లాంటౌ ద్వీపంలో కొత్తగా నిర్మించిన వాటర్‌ఫ్రంట్ ప్రొమెనేడ్‌లో తెలుగు ప్రజలంతా పాటలు పాడుతూ ఉత్సాహంగా బతుకమ్మ పండుగను జరుపుకొన్నారు. ది హాంకాంగ్ తెలుగు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు జయ పీసపాటి మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో వరుసగా ఆరో సంవత్సరం బతుకమ్మను నిర్వహించుకోవడం ఆనందంగా ఉన్నదని పేర్కొన్నారు. విదేశాల్లో ఉన్నా తెలుగు, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను మరిచిపోవద్దనే ఉద్దేశంతో ఈ పండుగలను నిర్వహిస్తున్నామని చెప్పారు. నవంబర్‌లో కార్తిక వనభోజనాలు, దీపావళి వేడుకల ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తున్నట్టు వివరించారు.

కెనడాలో..

కెనడాలోని క్యాలరీ నగరంలో విజయదశమి, బతుకమ్మ వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. బోనెస్ కమ్యూనిటీ అసోసియేషన్ హాల్‌లో క్యాలరీ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. ఈ వేడుకలకు ము ఖ్య అతిథులుగాఅల్బెర్టా ప్రావిన్స్ సాంస్కృతిక శాఖ మంత్రి మహమ్మద్ యాసిన్, డిప్యూటీ మేయర్ వాంగ్ హాజరయ్యారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన 20 మంది చిన్నారులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది మహిళలు, 250 మంది పురుషులతోపాటు సత్య కొంపల్లి, సుకేశ్ బవండ్ల, అశ్విన్ తుములు, రవి పల్లె, నమ్రత మంగు, రాహుల్ దండే, విష్ణు గబ్బుల, సునీల్ రాజవరం, అనంత్ మంగు, మదన్ చిలువేరి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసిన 28 ఏండ్లకు ఉద్యోగం

న్యూఢిల్లీ, అక్టోబర్ 25: ఉద్యోగానికి దరఖాస్తు చేసిన 28 ఏండ్లకు ఒక వ్యక్తికి సుప్రీం కోర్టు జోక్యంతో ప్రభుత్వ ఉద్యోగం లభించింది. అంకుర్ గుప్తా 1995లో పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోగా, ఆ శాఖ అతనికి శిక్షణ కూడా ఇచ్చింది. అతడు ఇంటర్‌ను వొకేషనల్ స్ట్రీమ్‌లో పూర్తి చేసినందున ఉద్యోగానికి అనర్హుడంటూ పోస్టల్ శాఖ అతడిని మెరిట్ లిస్టు నుంచి తొలగించింది. అయితే అతడు, అలాంటి మరికొందరికి ట్రిబ్యునల్, అలహాబాద్ హైకోర్టులలో అనుకూలంగా తీర్పు రావడంతో పోస్టల్ శాఖ సుప్రీంను ఆశ్రయించింది. కేసును విచారించిన జస్టిస్‌లు అంకుర్ గుప్తాకు అనుకూలంగా తీర్పు చెప్పారు. అర్హత అంశాన్ని ముందుగానే చూసుకోవాలని, పైగా అతడికి శిక్షణ కూడా ఇచ్చినందున ఉద్యోగంలోకి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.